క్లుప్తంగా

అప్పన్న సన్నిధిలో మజ్జి శ్రీనివాసరావు



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న మజ్జి శ్రీనివాసరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని వైఎస్సార్‌సీపీ భీమిలి ఇన్‌చార్జ్, విజయనగరం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) శుక్రవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడామండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. వేద ఆశీర్వచనం అనంతరం ఆలయ సంప్రదాయం ప్రకారం ఆయనకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను ఏఈవో తిరుమలేశ్వరరావు అందించారు.

వాహనం ఢీకొని యాచకురాలి మృతి



మృతి చెందిన బిచ్చగత్తె

పీఎం పాలెం: జాతీయ రహదారి దాటుతున్న బిచ్చగత్తెను వాహనం ఢీ కొట్టిన ఘటనలో ఆమె అక్కడికక్కడే మరణించింది. ఇందుకు సంబంధించి పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలివి.. గురువారం రాత్రి ఓ వృద్ధురాలు స్వింగ్ బార్ ఎదురుగా ఉన్న జాతీయ రహదారిని దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో, ఆమె అక్కడికక్కడే మరణించింది. మృతురాలు బిచ్చగత్తెగా పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించి, ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. మృతురాలికి సంబంధించిన సమాచారం తెలిస్తే ఫోన్ నంబర్లు 0891-2721333, 94407 96060 లకు ఫోను చేసి సంప్రదించాలని సూచించారు.

రేపు అష్టలక్ష్మీ ఆలయం మూసివేత

కొమ్మాది: స్థానిక అన్నంరాజు నగర్‌లో గల అష్టలక్ష్మీ దేవాలయాన్ని ఈ నెల 7వ తేదీన సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా మూసివేయనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి శ్రీధర స్వామి తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి ఆలయాన్ని మూసివేస్తామని పేర్కొన్నారు. సోమవారం ఉదయం సంప్రోక్షణ అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించనున్నట్లు తెలియజేశారు.

జయహో కలాం ప్రోమో ఆవిష్కరణ

కొమ్మాది: భీమిలి స్టూడెంట్స్ యునైటెడ్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీ నుంచి అక్టోబర్ 15వ తేదీ వరకు నెల రోజుల పాటు అబ్దుల్‌కలాం జయంత్యుత్సవాలను ఉమ్మడి విశాఖలో నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి 'జయహో కలాం – ఆప్కా సలాం' అబ్దుల్ కలాం జయంతి ఉత్సవాల ప్రోమోను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రుషికొండలో శుక్రవారం ఆవిష్కరించారు. కలాం స్ఫూర్తిని యువతలో నిలిపేందుకు పలు చోట్ల కలాం విగ్రహాల ఏర్పాటు, ఆయన జీవిత చరిత్రపై వ్యాస రచన పోటీలు నిర్వహించనున్నట్లు నెట్‌వర్క్ అధ్యక్షుడు బసవ కృష్ణ తెలిపారు.

శ్రీనివాసనగర్ గణపతి లడ్డూ @80 వేలు

మధురవాడ: మధురవాడ శ్రీనివాస నగర్ గణపతి లడ్డూను స్వతంత్రనగర్‌కు చెందిన కర్రి రామారావు, చంద్రంపాలేనికి చెందిన పిళ్లా రాములు సంయుక్తంగా పాటలో సొంతం చేసుకున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు నిర్వహించిన వేలంలో 109 కేజీల లడ్డూను రూ.80 వేలకు పాడుకున్నారు.

రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్‌గా ఐనాడ



తగరపువలస: ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ డైరెక్టర్‌గా జీవీఎంసీ ఒకటోవార్డు సంతపేటకు చెందిన జనకవి ఐనాడ దుర్గాప్రసాద్ నియమితులయ్యారు. దుర్గాప్రసాద్ గతంలో ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యునిగా, సౌత్ జోన్ కల్చరల్ రాష్ట్ర గవర్నర్‌గా బాధ్యతలు నిర్వహించారు. సామాజిక ఇతివృత్తం ప్రధానంగా సాగే రచనలు చేసే ఈయనకు సామాజిక గేయరచయితగా, పేరడీ రచయితగా కూడా గుర్తింపు ఉంది. నాటక అకాడమీ డైరెక్టర్‌గా గ్రామీణ కళల పరిరక్షణ, కళాకారుల సంక్షేమానికి కృషి చేయనున్నట్టు ఆయన తెలిపారు.

నేడు అనంతుని జయంతి

ముస్తాబైన పద్మనాభంలోని ఆలయం • వ్రతాలు, పూజలకు సర్వం సిద్ధం • సన్నాహాలు పూర్తి చేసిన అధికారులు



శ్రీదేవి భూదేవి సమేత అనంతుని పెద్ద ఉత్సవ విగ్రహాలు



గిరిపై అలంకరణలో అనంతుని విగ్రహం



వ్రతాలు జరపనున్న కుంతీ మాధవ స్వామి ఆలయం



పుష్పమాలలతో అలంకరించిన కుంతీ మాధవ స్వామి ఆలయ లోపల భాగం

పద్మనాభం: పద్మనాభంలో వెలసిన అనంత పద్మనాభ స్వామి జయంతి వేడుకలు శనివారం కనులపండువగా జరగనున్నాయి. ఇందుకు ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉత్సవ విగ్రహాలకు నూతన వస్త్రాలను సమకూర్చారు. కుంతీ మాధవ స్వామి ఆలయ లోపలి భాగాన్ని పూల మాలలు, మామిడి తోరణాలతో అందంగా అలంకరించారు. మెట్లపై ఉండే పిచ్చి మొక్కలు తొలగించారు. గిరిపై ఆలయ పరిసర ప్రాంతాలను పరిశుభ్రం చేశారు.

క్షేత్ర మహాత్మ్యం

యావద్భారత దేశంలో అనంత పద్మనాభ స్వామి ఆలయాలు రెండు చోట్లే ఉన్నాయి. ఒకటి కేరళ రాజధాని తిరువనంతపురం కాగా, మరొకటి ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ జిల్లా పద్మనాభం మండలం పద్మనాభంలో ఉన్నాయి. పద్మనాభంలోని గిరిపై సాలగ్రామ శిలపై శంఖు చక్రాలతో లక్ష్మీ, సర్పాలతో అనంతుడు వ్యక్త, అవ్యక్త స్వరూపంలో స్వయంభూగా వెలిసినట్లు భవిష్య పురాణంలో పేర్కొన్నట్లు చెబుతారు.

వ్రత ప్రాధాన్యం

పాండవులు అరణ్యవాసం అనంతరం అజ్ఞాతవాసానికి పద్మనాభం గిరికి వేంచేశారని, శ్రీకృష్ణ పరమాత్ముడిని ప్రార్థించగా ఆయన ప్రత్యక్షమై భాద్రపద శుద్ధ చతుర్దశి రోజు అనంతుని జయంతి అని, ఆ రోజు అనంతుని వ్రతం జరిపిస్తే రాజ్య ప్రాప్తి, ఐశ్వర్యం, పుత్రపౌత్రాభివృద్ధి కలుగుతుందని చెప్పి..అనంతుని వ్రత విధానం గురించి తెలియజేశారని పురాణ కథనం. పరమాత్మ ఆదేశానుసారం అనంతుని వ్రతం పూర్తి చేసి, పాండవులు విజయం సాధించారని చెబుతారు. అప్పటి నుంచి అనంతుని జయంతి రోజు వ్రతాలు చేయడం ఆనవాయితీగా వస్తోంది.

వేడుకలు ప్రారంభమిలా..

కుంతీ మాధవ స్వామి ఆలయంలో కొలువై ఉన్న శ్రీదేవి భూదేవి సమేత అనంత పద్మనాభ స్వామి పెద్ద ఉత్సవ విగ్రహాలను వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ బేడాలోని నైరుతి దిశలోకి తీసుకు వచ్చి ఆశీనులను చేస్తారు. శ్రీదేవి భూదేవి సమేత అనంత పద్మనాభ స్వామి చిన్న ఉత్సవ విగ్రహాలను పద్మనాభం జంక్షన్‌లోని స్వామి పుష్కరిణి వరకు పల్లకీపై ఊరేగింపుగా తీసుకు వెళ్తారు. ఇక్కడి నుంచి ఉత్సవ విగ్రహాలను వాహనంలో గిరిపైకి తోడ్కొని వెళతారు. గిరిపై ముందుగా విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం వంటి పూజాది కార్యక్రమాలు చేసిన అనంతరం పంచామృతాభిషేకాలు నిర్వహిస్తారు.

రెండు బ్యాచ్‌లుగా వ్రతాలు

అనంతుని వ్రతాలు దిగువన గల కుంతీ మాధవ స్వామి ఆలయ ప్రాంగణంలోని బేడాలో నిర్వహిస్తారు. వ్రతాలు రెండు బ్యాచ్‌లుగా చేస్తారు. మొదటి బ్యాచ్ వ్రతాలు ఉదయం 6.30 గంటలకు, రెండో బ్యాచ్ ఉదయం పది గంటలకు ప్రారంభమవుతాయని అర్చకులు తెలిపారు.

హెరిటేజ్ ఫెస్ట్ విజేతలకు బహుమతుల ప్రదానం నేడు

తగరపువలస: హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో గత నెల 2వ తేదీ నుంచి 11 వరకు ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంవీ రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠంలో హెరిటేజ్ ఫెస్ట్-2025 పేరుతో నిర్వహించిన పోటీల్లో విజేతలకు శనివారం బహుమతులు అందించనున్నారు. ఉదయం 11 గంటలకు శ్రీరాధా మదన్ మోహన మందిరంలో డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ చేతుల మీదుగా వీటిని అందిస్తారు. చిత్రలేఖనం, పౌరాణిక వేషధారణ, భగవద్గీత శ్లోక పఠనం, గాత్ర సంగీతం, నాటకాలు, శాస్త్రీయ సంగీతం, పాట్ పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్ పోటీలు నిర్వహించినట్లు హరేకృష్ణ వైకుంఠం ప్రతినిధి అంబరీష దాస తెలిపారు.

లంబోదరుడికి వెయ్యి లడ్డూలతో అర్చన



గణపతికి నివేదించిన వెయ్యి లడ్డూలు

మధురవాడ: గణేష్ నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం గణేష్‌నగర్‌లోని శ్రీ విజయ గణపతి పంచాయతన ఆలయంలో స్వామికి వెయ్యి లడ్డూలు నివేదించి, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

ఘనంగా చిన్న శ్రీను జన్మదిన వేడుకలు



పిల్లలకు దుస్తులు పంపిణీ చేస్తున్న చిన్న శ్రీను



చిన్న శ్రీనుకు శుభాకాంక్షలు తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు

కొమ్మాది: వైఎస్సార్‌సీపీ భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) జన్మదిన వేడుకలు ఎండాడ వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నియోజకవర్గ నాయకుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం విజయనగరం నుంచి ఆనందపురం మండలం వెల్లంకికి చేరుకోగా స్థానిక నాయకులు ఆయనను ఘనంగా సత్కరించారు. అక్కడి నుంచి సింహాచలం వెళ్లి స్వామిని దర్శించుకున్న అనంతరం నాయకులు, కార్యకర్తలు భారీ బైక్ ర్యాలీ ద్వారా ఎండాడ పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. నాయకులు గజమాలతో సత్కరించి స్వాగతం పలికారు. అనంతరం కేక్ కట్ చేశారు. పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు ఆయనకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి బింగి హరికిరణ్ రెడి ఆధ్వర్యంలో అనాథాశ్రమంలో పిల్లలకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, జెడ్పీటీసీ కోరాడ వెంకట్రావు, ఎంపీపీ దంతులూరి వాసురాజు, కె.రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు బోని బంగారునాయుడు, కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు, మండల అధ్యక్షులు బంక సత్యం, గాడు శ్రీను, కోరాడ లక్ష్మణ్, వార్డుల అధ్యక్షులు గుడ్ల పోలిరెడ్డి, అల్లిపిల్లి నర్సింగరావు జగ్గుపిల్లి ప్రసాద్, పాల రమణారెడ్డి, పోతిన హనుమంతు, పార్టీ సీనియర్ నాయకులు కోరాడ వెంకటరావు, అక్కరమాని రామునాయుడు, మజ్జి వెంకట్రావు, సిరి సహస్ర, షణ్ముఖరావు, జీరు వెంకటరెడ్డి, అక్కరమాని మంగరాజు, పిల్లా సూరిబాబు, బెందాళం పద్మావతి, ముదుండి రాజేశ్వరి, పిల్లా సుజాత, బొడ్డు దుర్గారావు, చెన్నాదాసు, ఇల్లాపు వెంకట్రావు, బోర రామకృష్ణ, ఎరుసు అప్పలకొండ రెడ్డి, పోతిన మనోజ్ కుమార్, పోతిన ప్రసాద్, రాష్ట్ర వలంటీర్ విభాగ అధ్యక్షుడు యనమల నాగార్జున యాదవ్ తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

భీమునిపట్నం: మూడో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు రాంభుక్త ప్రభాకర్‌నాయుడు, కదిరి ఎల్లాజీ ఆధ్వర్యంలో నాయకులు చిన్నశ్రీనును కలిసి, శుభాకాంక్షలు తెలిపారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

తగరపువలస: చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఈఈ తెలిపారు. ఈ కారణంగా కొత్తపేట, కొండపేట, సంతపేట, చిట్టివలస, జ్యూట్ మిల్లు క్వార్టర్స్, సప్తగిరి థియేటర్ లే అవుట్, గణేష్ థియేటర్ రోడ్డు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

భీమిలి సబ్‌స్టేషన్ పరిధిలో..

చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు భీమిలి, నేరెళ్లవలస, జేవీ అగ్రహారం, కొత్తవలస, నిడిగట్టు, కుమ్మరిపాలెం, స్మిత్ వీధి, అప్పికొండవీధి, బ్యాంకు కాలనీ, కొత్త మూలకుద్దు, రేఖవానిపాలెం, రాయపాలెం, మహాలక్ష్మీపురం, భీమిలి మహిళా పాలిటెక్నిక్ కళాశాల, జగనన్న కాలనీ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలియజేశారు.

ఆనందపురం మండల పరిధిలో..

ఆనందపురం మండలం బోని, శిర్లపాలెం ఫీడర్లలో నిర్వహణ పనుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుంది. ఈ కారణంగా శిర్లపాలెం, బోని ఏజీఎల్, బోని హెడ్ క్వార్టర్స్, ముకుందపురం, ముకుందపురం వైఎస్సార్ కాలనీ, పేకేరులో గృహ, పారిశ్రామిక అవసరాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం





తాళ్లవలస హైస్కూల్ ఉపాధ్యాయుడు బాలరాజురెడ్డికి, చిప్పాడ హైస్కూల్ ఉపాధ్యాయుడు విజయ్‌కుమార్‌కు అవార్డు అందిస్తున్న మంత్రి బాల వీరాంజనేయస్వామి

తగరపువలస: భీమిలి మండలం తాళ్లవలస జెడ్పీ హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు జీరు బాలరాజురెడ్డి, చిప్పాడ జెడ్పీ హైస్కూల్ గణిత ఉపాధ్యాయుడు విజయ్‌కుమార్‌లకు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం లభించింది. ఈ మేరకు నగరంలో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి బాల వీరాంజనేయస్వామి చేతుల మీదుగా శుక్రవారం అవార్డులు స్వీకరించారు. కార్యక్రమంలో కలెక్టర్ ఎం.ఎన్.హరేందిరప్రసాద్, డీఈవో ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

లక్ష్మివానిపాలెంలో భారీ అన్న సమారాధన



భక్తులకు అన్న ప్రసాదం వడ్డిస్తున్న పోతిన ఎల్లాజీ

పీఎంపాలెం/మధురవాడ: గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 6వ వార్డు పీఎం పాలెం పరిధి లక్ష్మివానిపాలెంలో శుక్రవారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు, మణికంఠ ఈవెంట్స్ అండ్ సప్లయర్స్ అధినేత పోతిన ఎల్లాజీ దంపతులు కార్యక్రమాన్ని ప్రారంభించారు. పరిసర ప్రాంతాల నుంచి సుమారు 5వేల మంది హాజరై అన్నప్రసాదం స్వీకరించారు.

విద్య, వైద్యం దూరం చేయడమే కూటమి విధానమా?

వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త చిన్నశ్రీను

కొమ్మాది: పేదలకు విద్య, వైద్యం అందకూడదు అన్న విధానంతో కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తోందని వైఎస్సార్‌సీపీ భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) అన్నారు. మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఎండాడలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటుకు అప్పగించి పేదలకు వైద్య విద్యను, వైద్యాన్ని దూరం చేస్తోందని, ఈ చర్యలను వైఎస్సార్‌సీపీ తీవ్రంగా ఖండిస్తోందని అన్నారు. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎంతో ఉన్నతమైన లక్ష్యంతో మెడికల్ కళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టారని, కేంద్రాన్ని ఒప్పించి 5 మెడికల్ కళాశాలలకు అనుమతులు తెప్పించారని గుర్తు చేశారు. ప్రతీ పేదవాడికి వైద్య విద్య, మెరుగైన వైద్యం చేరువ కావాలని నాడు వైఎస్ జగన్ పరితపించారు. ప్రతి మెడికల్ కళాశాల పరిధిలో ఒక సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఉండాలనేది ఆయన ఆశయమని, కానీ నేడు కూటమి ప్రభుత్వం వాటికి తూట్లు పొడవడం బాధాకరమన్నారు. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో అడ్మిషన్లు తగ్గిపోయాయని, ఇటువంటి చర్యలతో పరోక్షంగా కార్పొరేట్ విద్యా సంస్థలకు ప్రభుత్వం కొమ్ము కాస్తోందన్నారు. ప్రభుత్వమే విద్య, వైద్యాన్ని పేదలకు అందించాలని వైఎస్సార్‌సీపీ డిమాండ్ చేస్తోందన్నారు. విద్య, వైద్య రంగాలను కార్పొరేట్ మయం చేసే ఆలోచనను కూటమి ప్రభుత్వం విరమించుకోవాలని హితవు పలికారు.

గౌరీ సుతునికి కుంకుమార్చన



భారీ గణనాథుడి మండపంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

మధురవాడ: చంద్రంపాలెంలో 41 అడుగులతో తీర్చిదిద్దిన శ్రీ శివ నందన ప్రియ గణనాథుని మండపంలో మహిళలు విశేషంగా కుంకుమ పూజలు చేశారు. సాయంత్రం దీపారాధన నిర్వహించారు. శుక్రవారం మధ్యాహ్నం నిర్వహించిన అన్న సమారాధనలో 6వేల మంది పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.

గణేశుడి అనుపునకు ప్రత్యేక టీ షర్టులు

జీవీఎంసీ 5వ వార్డు వైఎస్సార్ కాలనీలోని యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక అనుపు మహోత్సవం శుక్రవారం సాయంత్రం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కమిటీ సభ్యులకు కొమ్మాది జంక్షన్ వద్ద గల ఏకే ఫ్యాషన్స్ ప్రొప్రయిటర్ నేమాల అనేష్ కుమార్ టీ షర్టులు అందజేశారు. వీటిని పీఎంపాలెం సీఐ బాలకృష్ణ, ఎస్ఐ భాస్కరరావు అందజేశారు.

గురువులే మార్గనిర్దేశకులు



తాటితూరు జెడ్పీ హైస్కూల్లో ఉపాధ్యాయులను సత్కరించిన విద్యార్థులు



సాయి రవీంద్ర పాఠశాలలో గురువులకు సన్మానం



శిల్పారామంలో సర్వేపల్లి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న వాకర్స్



నగదు బహుమతులు, చెక్కులతో విద్యార్థులు



విశ్రాంత ఉపాధ్యాయులను సత్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

తగరపువలస: ఉపాధ్యాయ వృత్తి నుంచి అంచెలంచెలుగా ఎదిగి, రాష్ట్రపతి పదవి చేపట్టిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని భీమిలి మండలం తాటితూరు జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు డి.శ్రీనివాసరావు కోరారు. విద్యార్థులకు మంచి మార్గనిర్దేశకులుగా నిలవాలన్నారు. సర్వేపల్లి జయంతిని సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను సన్మానించారు. వారికి ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు టీఎస్‌వీ ప్రసాదరావు, టీఏ సూర్యనారాయణ, కె.వెంకటేశ్వర్లు, గంగరాజు, దీనలత, వెంకటలక్ష్మి, చంద్రమౌళి, రాజేశ్వరరావు, మోహనరావు పాల్గొన్నారు.

■ రామన్నపేట సాయిరవీంద్ర పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో చైర్మన్ బోగెల కృష్ణ, ప్రిన్సిపాల్ వాండ్రాసి సతీష్‌కుమార్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ గ్రహీతలైన బండారు సౌజన్య, ఇందుమతి, పార్వతి, పుష్పలత, నాగమణి, సుజాతలను సన్మానించారు.

రిటైర్డ్ హెచ్‌ఎంకు సత్కారం

మధురవాడ: చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సుదీర్ఘ కాలం పని చేసి, రిటైర్ అయిన మాజీ ప్రధానోపాధ్యాయుడు రాజబాబు దంపతులను మధురవాడ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఘనంగా సత్కరించారు. మిథిలాపురి వుడా కాలనీలోని ఆయన నివాసానికి వెళ్లి దుశ్శాలువాలు కప్పి, పూలమాలలు వేసి సత్కరించారు. పౌర సంక్షేమ సంఘం అధ్యక్షుడు నాగోతి సూర్యప్రకాశరావు, గౌరవాధ్యక్షుడు ఎల్ఎస్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామంలో..

పీఎం పాలెం: శిల్పారామంలో జాతర వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం నిర్వహించారు. రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సభ్యుల్లో ఉన్న ఉపాధ్యాయులను సత్కరించారు. నారాయణ స్వామి, సూర్యనారాయణ, శశికాంత్ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయులకు సత్కారం

భీమునిపట్నం: భీమిలిలో ప్రభుత్వ పింఛన్‌దారుల సంఘం, భీమిలి బీచ్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 25మంది విశ్రాంత ఉపాధ్యాయులను సత్కరించారు. ముఖ్యసభ్యులు టి.భీమారావు, ఎం.ఆనందరావు, బి.ఈశ్వరరావు పాల్గొన్నారు.

■ కీతినపేట సన్ స్కూల్‌లో డైరెక్టర్ కైతపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురుపూజోత్సవం నిర్వహించారు. పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులు, ఉపాధ్యాయులకు నగదు బహుమతులు అందించారు.

అధ్యాపకులకు పురస్కారాలు

తగరపువలస: ఆనందపురం మండలం శొంఠ్యాం ఎన్ఎస్ఆర్ఐటీ ఇండస్ట్రీ ఇనిస్టిట్యూట్ ఎంగేజ్‌మెంట్ ప్రొఫెసర్ పీఎస్ఐ నవీన్, మెకానికల్ విభాగం అధ్యాపకుడు బి.శివప్రసాద్‌లకు కౌన్సిల్ ఫర్ స్కిల్ అండ్ కాంపిటెన్స్ ఇన్ వర్క్ ఎడ్యుకేషన్ అవార్డులు లభించాయి. వీరికి సీఎస్‌సీ అకాడమీ డైరెక్టర్ రామ్మోహన్ అవార్డులు అందించారు. వీరిని జేఎన్‌టీయూ విజయనగరం వీసీ రాజ్యలక్ష్మి, ఎన్ఎస్ఆర్ఐటీ ప్రిన్సిపాల్ ఎస్.శంభుప్రసాద్ అభినందించారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు



వాంబేకాలనీ యూపీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

మధురవాడ: విధి నిర్వహణలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు హెచ్చరించారు. శుక్రవారం ఆయన మధురవాడ పీహెచ్‌సీ, వాంబే కాలనీ యూపీహెచ్‌సీలను సందర్శించారు. ఆయా ఆరోగ్య కేంద్రాలలో సేవలు, ఈహెచ్‌ఆర్, డయాగ్నస్టిక్ సేవలు, మందులు తదితర వాటి గురించి వైద్యాధికారులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ వాంబేకాలనీలో ఇద్దరు స్టాఫ్ నర్స్‌లు ఉండాల్సి ఉండగా ఒక్కరే అందుబాటులో ఉన్నట్టు గుర్తించామన్నారు. పైగా కొంతమంది సిబ్బంది కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఆరు తడితో వరి పైరుకు మేలు

పద్మనాభం: ఆరు తడి విధానంతో వరి పైరుకు మేలు చేకూరుతుందని ప్రకృతి వ్యవసాయం రీజనల్ టెక్నికల్ లీడ్ ప్రకాష్ అన్నారు. మండలంలోని పాత కొవ్వాడ, కోరాడ, మద్ది, గంధవరం గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు వరి పంటలో ఆరు తడి విధానంపై శుక్రవారం అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో ప్రకృతి వ్యవసాయం సిబ్బంది ఉష, దుర్గారావు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

68 మందికి కంటి వైద్య పరీక్షలు

తగరపువలస: జీవీఎంసీ రెండోవార్డు జీరుపేట గణేశుని మండపం వద్ద శుక్రవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 68 మందికి పరీక్షలు నిర్వహించారు. మధురవాడ నియో విజన్ ఆస్పత్రి వైద్యుడు బాలకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో 15 మందికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించారు. కార్యక్రమంలో క్యాంప్ మేనేజర్ పవన్‌కుమార్, గ్రామపెద్ద దల్లి అప్పలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెడ్డిపల్లి ఎరువుల షాపుపై విజిలెన్సు దాడులు

పద్మనాభం: మండల పరిధి రెడ్డిపల్లిలోని అనుమాలుశెట్టి వెంకటరావు ఫెర్టిలైజర్ షాపుపై విజిలెన్సు అధికారులు శుక్రవారం దాడులు చేశారు. షాపులోని స్టాక్, స్టాక్ రిజిస్టర్లు, బిల్లు పుస్తకాలు పరిశీలించారు. యూరియా ఎంత ధరకు అమ్ముతున్నారో ఆరా తీశారు. పద్మనాభం మండలం రైతులకు మాత్రమే యూరియా ఇవ్వాలని షాపు యజమానికి సూచించారు. వీరి వెంట ఏవో ఎంపీఎస్ చలం ఉన్నారు.